సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

మంగళవారం । 1 । ఏప్రిల్ । 2025



విద్యుత్‌కూ వేసవి తాపం!

ఎండలు మండుతున్న ఈ తరుణంలో విద్యుత్ ఉపకరణాల వినియోగం పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో వైరింగ్ విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి.


8లో



పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణకు డిమాండ్

పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని కాకినాడ జిల్లాలోని క్రైస్తవులు డిమాండ్ చేశారు.

10,700 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 10,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,200, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.25 అడుగులు ఉంది.

న్యూస్‌రీల్

అలరిస్తున్న ఉగాది ఆహ్వాన నాటికలు



స్వేచ్ఛ నాటికలో సన్నివేశం

రావులపాలెం: ఉగాది పండగను పురస్కరించుకుని రావులపాలెంలోని కాస్మోపాలిటన్ రిక్రియేషన్ క్లబ్ (సీఆర్‌సీ) కాటన్ కళాపరిషత్ ఆధ్వర్యంలో సీఆర్‌సీ కళావేదికలో నిర్వహిస్తున్న 25వ ఉగాది ఆహ్వాన నాటికల పోటీలు విశేషంగా అలరిస్తున్నాయి. రెండవ రోజు పోటీలను తిలకించేందుకు పరిషత్ గౌరవ అధ్యక్షుడు, సినీనటుడు తనికెళ్ళ భరణి, సినీ నటులు గౌతంరాజు, జోగి నాయుడు, నెల్లూరు హరిబాబు, టీడీపీ నాయకుడు ఆకుల రామకృష్ణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. సోమవారం మూడు నాటికలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా నృత్యప్రదర్శన చేసిన చేసిన బాలికలకు సినీ, రాజకీయ ప్రముఖులు, సీఆర్‌సీ సభ్యులు ప్రశంసా పత్రాలను అందజేశారు. హైదరాబాద్ విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ వారి స్వేచ్ఛ నాటికను దర్శకుడు బీఎం రెడ్డి, రచన పరమాత్ముని శివరామ్ ప్రదర్శించిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంది. విజయవాడ మైత్రి కళానిలయం వారి బ్రహ్మ స్వరూపం నాటికను దర్శకుడు టీవీ పురుషోత్తం, రచన స్కిల్ద్ధలు సందేశాత్మకంగా ప్రదర్శించారు. హైదారాబాద్ మిత్ర క్రియేషన్స్ వారి ఇది రహదారి కాదు నాటికను దర్శకుడు ఎస్‌ఎం బాషా, రచన అకురాతి భాస్కర చంద్ర హాస్య భరితంగా ప్రదర్శించారు. ఏర్పాట్లను సీఆర్‌సీ అధ్యక్షుడు తాడి నాగమోహన రెడ్డి, కార్యదర్శి నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, సీఆర్‌సీ రూపశిల్పి విక్టరీ వెంకటరెడ్డి, నాటక కళాపరిషత్ డైరెక్టర్ కె.సూర్య, ఓల్డేజ్ హోమ్ ఉపాధ్యక్షుడు నందం సత్యనారాయణ, సీఆర్‌సీ డైరెక్టర్లు మల్లిడి విజయభాస్కరరెడ్డి, మల్లిడి అంజనీకుమార్‌రెడ్డి, సత్తి సూర్యభాస్కరరెడ్డి, పడాల సత్యనారాయణ రెడ్డి, పరిషత్ పర్యవేక్షణ డైరెక్టర్ పలివెల త్రిమూర్తులు పర్యవేక్షించారు.

13 నుంచి తలుపులమ్మ తల్లి గంధామావాస్య జాతర



గ్రామస్తులతో చర్చిస్తున్న ఈఓ విశ్వనాథరాజు

తుని రూరల్: లోవ కొత్తూరులో తలుపులమ్మ అమ్మవారి గంధామావాస్య జాతర ఏప్రిల్ 13 నుంచి 27 వరకూ నిర్వహించనున్నట్లు లోవ దేవస్థానం ఇన్‌చార్జ్ డిప్యూటీ కమిషనర్, కార్య నిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. ఉత్సవాల నిర్వహణపై లోవ దేవస్థానం కార్యాలయంలో సోమవారం ఆయన లోవ కొత్తూరు గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 13న గరగలు తీయడంతో ఉత్సవాలు ప్రారంభించి, 26న జాగరణ నిర్వహిస్తామని తెలిపారు. 27న అమ్మవారి ఊరేగింపు, తీర్థం జరుపుతామన్నారు. ప్రతి సంవత్సరం లోవ కొత్తూరులో అమ్మవారి పుట్టింటి సంబరాలుగా గంధామావాస్య ఉత్సవాలు, ఆషాఢ మాసంలో లోవ దేవస్థానంలో ఉత్సవాలు చేయడం ఆనవాయితీ. ఈ సంవత్సరం గంధామావాస్య ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని, ప్రతి సంవత్సరం మాదిరిగానే ఉత్సవాలకు అవసరమైన నిధులను దేవస్థానం నుంచి కేటాయించాలని గ్రామస్తులు కోరారు. ఉత్సవాల నిర్వహణలో గ్రామస్తులు ఐక్యంగా సహకరించాలని ఈఓ విశ్వనాథరాజు కోరారు. సమావేశంలో దేవస్థానం మాజీ చైర్మన్ దూలం మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన రత్నగిరి



సత్యదేవుని దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

అన్నవరం: వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రత్నగిరి సోమవారం కిటకిటలాడింది. ఉదయం నుంచీ భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి, సత్యదేవుని వ్రతాలాచరించి, దర్శనం చేసుకున్నారు. స్వామివారి ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట పట్టింది. సత్యదేవుని దర్శించిన అనంతరం భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. సత్యదేవుని మొత్తం 40 వేల మంది దర్శించుకున్నారు. వ్రతాలు 1,500 నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకంలో సుమారు 5 వేల మంది భక్తులు స్వామి అన్న ప్రసాదం స్వీకరించారు.

సర్కారు వారి పీకేవైసీ!

- రేషన్ సరకుల సరఫరాకు ఈ–కేవైసీ లింక్ పెట్టిన కూటమి ప్రభుత్వం
- నిబంధనల పేరుతో కార్డులు పీకేయడమే అసలు ఉద్దేశం
- కోనసీమ జిల్లాలో 90.60 శాతం మాత్రమే పూర్తి
- తాజాగా ఏప్రిల్ 30వ తేదీ వరకు గడువు పెంపు
- నమోదు కానివారిలో 90 శాతం వలస వెళ్లినవారే
- గల్ఫ్ దేశాల్లో పెద్ద ఎత్తున ఉపాధి పొందుతున్న రాజోలు దీవి వాసులు
- ఉద్యోగాలు, ఉన్నత చదువుల కోసం హైదరాబాద్ వెళ్లిన జిల్లా వాసులు
- కూలీలుగా వచ్చి ఉపాధి పొందుతున్న ఉత్తరాది జనం
- ప్రభుత్వ నిర్ణయంతో రేషన్ కోల్పోతామని లబ్ధిదారుల ఆందోళన



ఉప్పలగుప్తం మండలం వాడపర్రులో ఎండీయూ వాహనం ద్వారా రేషన్ పంపిణీ



అమలాపురంలో వృద్ధుల నుంచి ఈ - కేవైసీ నమోదు చేస్తున్న సిబ్బంది

సాక్షి, అమలాపురం: అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు దాటినా ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేయలేదు సరి కదా ఇప్పుడు ఉన్న సంక్షేమ పథకాలకు సైతం కత్తెర పెడుతోందనే అనుమానాలు లబ్ధిదారులకు కలుగుతున్నాయి. మంచాలపై జీవితం వెళ్లదీస్తున్న దీర్ఘకాలిక రోగులలో... దివ్యాంగులలో అనర్హులు ఉన్నారని తనిఖీల పేరుతో ముప్పుతిప్పలు పెట్టిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు పేదలకు ఇచ్చే రేషన్‌పై పడింది. రేషన్ లబ్ధిదారులు తప్పనిసరిగా ఈ– కేవైసీ చేసుకోవాలనే నిబంధనతో లబ్ధిదారులకు కోత పెడుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత సంక్షేమ పథకాల లబ్ధిదారులను తగ్గించేందుకు అనేక సర్వేలు నిర్వహిస్తోంది. దీనిలో భాగంగానే రేషన్ కార్డులకు ఈ–కేవైసీ చేయించాలని ఆదేశించిందని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అధికార యంత్రాంగం లబ్ధిదారులకు ఈ– కేవైసీని అనుసంధానం చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 5,37,902 రేషన్ కార్డులున్నాయి. వీటి ద్వారా 15,25,708 మంది లబ్ధి పొందుతున్నారు. ఎప్పటి వరకు 13,82,339 మంది లబ్ధిదారులకు ఈ– కేవైసీ పూర్తయింది. ఇంకా 1,43,369 మందికి పూర్తి కావాల్సి ఉంది. జిల్లాలో మొత్తం లబ్ధిదారులలో 90.60 శాతం పూర్తయిందని అధికారులు చెబుతున్నారు. రేషన్ కార్డుల్లో ఉన్న ప్రతి లబ్ధిదారుకూ ఈ–కేవైసీ చేయకపోతే ఏప్రిల్ రేషన్ ఇవ్వరని క్షేత్ర స్థాయిలో ప్రచారం జరిగింది. అయితే ప్రభుత్వం తాజాగా ఏప్రిల్ 30 వరకు గడువు పెంచడంతో లబ్ధిదారులు ఊపిరి పీల్చుకున్నారు. కానీ ఏదో రూపంలో ప్రభుత్వం రేషన్ కార్డులకు కోత పెడుతుందనే భయాందోళనలు మాత్రం లబ్ధిదారులలో ఉన్నాయి.

రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబాన్నీ ఒక్కో యూనిట్‌గా పరిగణించి ఈ–కేవైసీ ప్రక్రియ జరుగుతోంది. ఐదేళ్లలోపు చిన్నారులకు అవసరం లేదు. మిగిలినవారు రేషన్ డీలర్లు, వీఆర్‌ఓలు, ఎండీయూ ఆపరేటర్ల వద్ద తక్షణమే ఈ–కేవైసీ చేయించుకోవాలని పౌర సరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు.

మండలం పేరు	మొత్తం కార్డులు	లబ్ధిదారులు	ఈ– కేవైసీ అయినవి	జరగాల్సినవి	ఈ– కేవీసీ అయిన శాతం
కపిలేశ్వరపురం	21,794	59849	54,741	5,108	91.47
మండపేట	42,893	1,17,381	1,07,383	9,998	91.48
కె.గంగవరం	20,495	56,872	52,118	4,754	91.64
రామచంద్రపురం	34,476	95,287	87,741	7,546	92.08
రాయవరం	21,094	56,056	51,570	4,486	92.00
అల్లవరం	21,241	61,908	55,346	6,562	89.40
అమలాపురం	38,438	1,11,003	1,03,059	8,944	91.94
ఐ.పోలవరం	21,495	61,465	55,736	5,729	90.68
కాట్రేనికోన	23,482	69,297	60,473	8,824	87.27
మలికిపురం	24,227	70,022	62,092	7,930	88.67
మామిడికుదురు	21,958	63,109	57,064	6,045	90.42
ముమ్మిడివరం	21,746	61,798	56,965	4,833	92.18
రాజోలు	21,687	62,189	56,341	5,848	90.60
సఖినేటిపల్లి	23,051	65,697	57,553	8,144	87.60
ఉప్పలగుప్తం	18,863	54,799	48,782	6,017	89.02
అయినవిల్లి	20,873	59,858	54,600	5,258	91.22
ఆలమూరు	24,194	67,345	61,957	5,388	92.00
అంబాజీపేట	19,730	56,695	51,594	5,101	91.00
ఆత్రేయపురం	21,572	60,440	54,795	5,645	90.66
కొత్తపేట	24,107	70,379	63,591	6,788	90.36
పి.గన్నవరం	23,748	69,026	61,918	7,108	89.70
రావులపాలెం	26,738	75,233	67,920	7,313	90.28

సంక్షేమ పథకాల్లో కోత విధించేందుకే...



రాష్ట్ర ప్రభుత్వం అరకొరగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో మరింత కోతను విధించేందుకే ఈకేవైసీని తెరపైకి తెచ్చింది. జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన పేద, సామాన్య ప్రజలందరూ **ఈకేవైసీ వేసేం**దుకు వ్యయ ప్రయా**సలు పడి వస్తున్నారు.** రేషన్ డీలర్లపై ఈకే**వైసీని బలవంతంగా** రుద్ది లబ్ధిదారులను అనుమానిస్తున్నారు.

– తోరాటి లక్ష్మణరావు, ఎంపీపీ, ఆలమూరు మండలం

వలస జీవులకు ఇక్కట్లు

రేషన్‌కు ఈ– కేవైసీ అనుసంధానం వలస జీవులను ఇక్కట్లు పాల్జేస్తోంది. జిల్లాకు చెందిన గృహ నిర్మాణ కార్మికులు, ఇతర కూలీలు హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లి ఉపాధి పొందుతున్నారు. మరికొన్ని కుటుంబాలలో యువత ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లారు. వీరంతా ఈ కేవైసీ నమోదు కోసం సొంత జిల్లాలకు రావాల్సిన పరిస్థితి. ఇందుకువారు వ్యయప్రయాసలకు లోనవుతున్నారు. ఉతరాంధ్ర జిల్లాలకు చెందిన వ్యవసాయ కూలీలు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో నర్సరీలు, ఇటుక బట్టీలు, కాయర్ పరిశ్రమలు, వ్యవసాయ కూలీలుగా, కొబ్బరి దింపు కార్మికులుగా ఇక్కడ ఉండి జీవనోపాధి పొందుతున్నారు. వారు సొంత జిల్లాలకు వెళ్లి రావాల్సి వస్తోంది. ముఖ్యంగా రాజోలు దీవి నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లి జీవనోపాధి పొందుతున్న సామాన్యులు, పేదలు ఉన్నారు.

వీరు ఇతర ప్రాంతాలలో ఉన్నా వారి కుటుంబ సభ్యులు రేషన్ పొందుతున్నారు. ఈ– కేవైసీ నమోదు కానివారి జాబితాలు పౌరసరఫరాల శాఖ నుంచి రేషన్ డీలర్లకు వచ్చాయి. వీరందరికీ ఈ కేవైసీ చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి వస్తోంది. స్థానికంగా లేని వారితో ఈ ప్రక్రియ ఎలా పూర్తి చేయాలా? అని డీలర్లు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పుడు ఈ కేవైసీ మెలిక వల్ల వారు రేషన్ పొందేందుకు శాశ్వతంగా దూరం అవుతారు. మరి కొంతమందికి ఏకంగా రేషన్ కార్డులు రద్దయ్యే ప్రమాదం ఏర్పడనుంది.

నేటి నుంచి ఇంటర్ తరగతులు

- రెండు నెలల ముందు నుంచే..
- డీఐఈవో సోమశేఖరరావు



అమలాపురం టౌన్: గతంలో ఇంటర్మీడియెట్ విద్యా సంవత్సరం జూన్ 1వ తేదీన మొదలయ్యేది. అయితే ఈసారి రెండు నెలల ముందే అంటే ఏప్రిల్ 1వ తేదీ నుంచే ఇంటర్మీడియెట్ తరగతులు ప్రారంభమవుతున్నాయని డీఐఈవో వనుము సోమశేఖరరావు తెలిపారు. ఇంటర్మీయెట్ బోర్డు తీసుకున్న సరికొత్త నిర్ణయం వల్ల జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో మంగళవారం నుంచి ఇంటర్ తరగతులు మొదలవ్వాలని ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు ఆదేశిలిచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. అమలాపురంలో డీఐఈవో ఈ విషయాన్ని సోమవారం సాయంత్రం విడుదల చేసిన ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ కళాశాలల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతుల నిర్వహణ ఉంటుందన్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు తాత్కాలిక అడ్మిషన్లు ప్రారంభమవుతాయని వివరించారు. ఈ నెల 24వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకూ వేసవి సెలవులు ఉంటాయని పేర్కొన్నారు. జూన్ 2వ తేదీ నుంచి కళాశాలల పునః ప్రారంభం ఉంటుందని వివరించారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గల డీఐఈవో కార్యాలయంలోని స్టోరేజ్ పాయింట్‌కు ఇప్పటికే ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, ఇంగ్లిషు పాఠ్య పుస్తకాలు చేరుకున్నాయని తెలిపారు. అమలాపురం స్టోరేజ్ పాయింట్ నుంచి జిల్లాలోని పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు పుస్తకాలు పంపిణీ కార్యక్రమం సోమవారం నుంచి మొదలైందని సోమశేఖరరావు వెల్లడించారు. ఒక్కో విద్యార్థికి ఆరు రూల్స్ పుస్తకాలు, ఆరు తెల్ల కాగితాల నోట్ పుస్తకాలు ఇస్తామన్నారు. డీఐఈవోతోపాటు సెకండరీ విద్య జిల్లా కమ్యూనికేషన్ మొబలైజేషన్ ఆఫీసర్ (సీఎంవో) బొరుసు వీర వెంకట సుబ్రహ్మణ్యం ఈ పుస్తకాల పంపిణీని పర్యవేక్షించారు.

ఆనందోత్సాహాలతో రంజాన్



మగటపల్లిలో రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

మామిడికుదురు: పవిత్ర రంజాన్ వేడుకను ముస్లింలు సోమవారం ఆనందోత్సాహాలతో నిర్వహించుకున్నారు. మామిడికుదురు షియా జామియా మసీదు, నగరంలోని పెద పంజీషా, మొగలికుదురు, కొమరాడ, మగటపల్లి మసీదుల్లో రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. మత ప్రబోధకులు షబ్బర్ అలీజైదీ, మెహదీ హసన్ బెహిష్తి, మహ్మద్ ఇబ్రహీమ్ ముస్లింలతో ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. ఈ సందర్భంగా చిన్నారులతో పాటు పెద్దలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పరస్పరం ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. నెలరోజుల పాటు తాము చేసిన ఉపవాస దీక్షలు, ఖురాన్ పఠనాన్ని అల్లా ఆమోదించాలని ప్రార్థనలు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన ముస్లింలు రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. భక్తులకు మసీదు కమిటీలు సదుపాయాలు కల్పించాయి. మగటపల్లి సున్నీ జామియా మసీదు కమిటీ అధ్యక్షుడు ఎండీ సమిద్ బాషా ఆధ్వర్యంలో రంజాన్ వేడుకలు జరిగాయి.

కొమరాడలో నల్లబ్యాడ్జీలతో నిరసన

రంజాన్ సందర్భంగా కొమరాడ రహీమియా మసీదులో నల్ల బ్యాడ్జీలతో ముస్లింలు రంజాన్ వేడుకల్లో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు నిరసనగా నల్ల బ్యాడ్జీలు పెట్టుకుని నమాజులో పాల్గొన్నారు. వక్ఫ్ ఆస్తులు బోర్డు ఆధీనంలోనే ఉండాలని, ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాన్ని యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆ చట్టానికి తూట్లు పొడిచే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి సవరణలు ప్రవేశ పెట్టినా దాన్ని ముస్లిం సమాజం వ్యతిరేకిస్తుందని జమాత ఉలేమా హింద్ ఇచ్చిన పిలుపు సందర్భంగా నిరసన తెలిపారు.



కొమరాడలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపిన ముస్లింలు

బతుకు బాటలో పూలవాన!

- 'మొక్క'వోని దీక్షతో కోరుమిల్లివాసుల శ్రమ
- నగరాల్లో నర్సరీల నిర్వహణలో 400 కుటుంబాలు
- 40 ఏళ్లుగా ఇదే వ్యాపారం



హైదరాబాద్ రహదారి వద్ద కోరుమిల్లి వాసుల నర్సరీ



అమలాపురం మెయిన్ రోడ్డులో నర్సరీ

కపిలేశ్వరపురం: ఒక్కో ప్రాంతానికి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. కోరుమిల్లి గ్రామానికి మొక్కల వ్యాపారం ప్రత్యేకత. 40 ఏళ్ల క్రితం గ్రామానికి చెందిన కొందరు బతుకు తెరువు కోసం చేసిన అన్వేషణ అనేక కుటుంబాల వారి జీవితంలో స్థిరత్వానికి బాట వేసింది. ఇంటికిద్దరు చొప్పున పదిమందితో బృందంగా ఏర్పడి హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, ఒంగోలు, తదితర సుదూర ప్రాంతాల్లో నర్సరీలను నిర్వహిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని నగర, పట్టణ ప్రాంతాలకెళ్లినప్పుడు ఏదో ఒకచోట కోరుమిల్లివాసులు ఎదురవుతారంటే అతిశయోక్తికాదు. నర్సరీల నిర్వహణలో దేశవ్యాప్తంగా పేరుతెచ్చుకున్న కోరుమిల్లి వాసుల జీవన విధానంపై కథనం.

ఆత్మ విశ్వాసంతో సాగితే అంతా మంచే జరిగింది

కోరుమిల్లి వాసులు ఏళ్ల తరబడి గోదావరి లంకల్లో కూరగాయలు, ఉద్యాన పంటలు సాగు చేశారు. గ్రామంతోపాటు, సమీప ర్యాంపుల్లో ఇసుక లోడింగ్ చేయడంలో కోరుమిల్లి గ్రామస్తులకు ప్రత్యేక పేరుంది. ఎంత కష్టపడినా ఆదాయం అంతంత మాత్రంగా ఉన్న నేపథ్యంలో 1985లో కొంతమంది కొబ్బరి మొక్కలను వాహనాల్లో తరలించి శ్రీకాకుళం, విజయనగరం ప్రాంతాల్లో విక్రయించడం ప్రారంభించారు. అప్పట్లో ప్రారంభమైన ఆ ప్రక్రియ కాస్తా నేడు నగరాలు, పట్టణ ప్రాంతాల్లో ఇంటికొక నర్సరీ పనికి వెళ్లేలా ప్రేరణ కల్పించింది. ఊరు కాని ఊరులో నర్సరీల నిర్వహణ నల్లేరు మీద నడక కాదు. పట్టణాల్లోని రహదారుల వెంబడి ఖాళీ స్థలాల్లో రేకులు, ఆకులు, టార్పాలిన్‌లతో తాత్కాలిక నివాసాలను ఏర్పాటు చేసుకొంటారు. సంవత్సరాలు తరబడి అవే వారికి ఆవాసం. తెలంగాణలోని హైదరాబాద్ ఎల్‌బీ నగర్ నుంచి పఠాన్ చెరువు వరకూ మూడు కిలోమీటర్లు దూరంలో సుమారు 100 వరకు నర్సరీలున్నాయి. కోరుమిల్లికి చెందిన 500 మంది ఆ నర్సరీల్లో పనిచేస్తున్నారు. ఆంధ్రా, ఒడిశా, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, మహారాష్ట్రలలో దాదాపు మరో 300 మంది పనిచేస్తున్నారు.

మొక్కల తరలింపు, విక్రయాలు ఇలా...

1985లో గ్రామానికి చెందిన పదిమంది కడియం నర్సరీలో మొక్కలను లోడు చేసుకుని ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయగరంలలో విక్రయించడంతో గ్రామంలో మొక్కల వ్యాపారం ప్రారంభమైంది. గ్రామానికి చెందిన యువకులు 2005 నుంచి హైదరాబాద్‌లో నర్సరీల నిర్వహణను కొనసాగిస్తున్నారు. నగరవాసుల నాడి పట్టిన కోరుమిల్లి వాసులు వ్యవసాయ పనులను వీడి క్రమంగా నర్సరీలవైపు మళ్లారు. జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు కర్ణాటకలోని మాణ్యం, బెంగళూరు, ఒడిశా, తెలంగాణ, ఆంధ్రలోని నెల్లూరు, గుంటూరు, విశాఖపట్టణం, విజయవాడ, ఒంగోలు ప్రాంతాల్లో మొక్కలను విక్రయిస్తున్నారు. పశ్చిమ బెంగాల్, ఒడిశా, మహారాష్ట్రలకు పాలకొల్లు నుంచి తీసుకెళ్లి కొబ్బరి మొక్కలను విక్రయిస్తుంటారు. కడియం, పూణేల నుంచి ఇండోర్, క్రోటన్స్ మొక్కలను, బెంగళూరు నుంచి గులాబీ మొక్కలను ఖరీదు చేసుకుని విక్రయాలు జరుపుతున్నారు.

విక్రయించే ప్రధాన మొక్కలు ఇవే..

పూల మొక్కలతో పాటు కొబ్బరి, సపోటా, బత్తాయి, నారింజ, మామిడి, నిమ్మ, దానిమ్మలతో పాటు బోన్సాయి, క్రోటన్స్ వంటి మొక్కలను కూడా విక్రయిస్తుంటారు. ఇంటీరియర్ డికరేషన్, నివాస ప్రాంతాలు, ఖాళీ స్థలాలు, సొంత పొలాల్లో పెంచుకునేందుకు కొనుగోలు చేస్తుంటారు. గులాబీ, తులసి, చామంతి, మందారం మొక్కలను కుండీల్లో అమర్చి పెంచుకుంటారు.

కలవరపర్చిన ఘటనలనేకం...

2016 ఆగస్టు 1 తెల్లవారు జామున మియాపూర్‌లోని మదీనగూడా వద్ద రోడ్డు పక్కన ఉన్న నర్సరీలో నిద్రిస్తున్న వారిపైకి లారీ దూసుకువెళ్లింది. చీకట్ల కృష్ణ అతని కుమారుడు వాసు, మరో యువకుడు బెజవాడ ఆదినారాయణ చనిపోయారు. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనలోని విషాద ఛాయలు చాలాకాలం నర్సరీ వ్యాపారులను తీవ్రంగా కలవరపెట్టాయి. రహదారి వెంబడి తాత్కాలిక నివాసాల్లో ఉంటుండటంతో చలి, ఎండ, వానల బారిన పడి తరచూ అనారోగ్యం పాలవుతుంటారు. కుటుంబ సభ్యులకు దూరంగా నెల నుంచి రెండు నెలలు వరకూ జీవించాల్సి వస్తుంటుంది.

శ్రమకు విలువ దక్కుతుంది



నాన్న నరసింహమూర్తి గతంలో శ్రీకాకుళంలో కొబ్బరి మొక్కలు వ్యాపారం చేసేవారు. ప్రస్తుతం నేను విజయవాడలో నర్సరీ నిర్వహిస్తున్నాను. రహదారి పక్కన తాత్కాలిక నివాసంలో సంవత్సరాల తరబడి ఉంటుంటాం. సమస్యలను తట్టుకోగలిగిన వారికి శ్రమకు తగ్గ ఫలితం దక్కుతుంది. ఖర్చులు పోనూ సరాసరిన రోజుకు రూ.రెండువేలు చొప్పున ఆదాయం వస్తుంది.

– వింటి సతీష్, నర్సరీ నిర్వాహకుడు

పట్టణ ప్రజలు ఆదరిస్తున్నారు



నర్సరీలను నుంచి మొక్కలను కొనుగోలు చేసి నగరాలు, పట్టణాల్లో విక్రయిస్తుంటాం. లాభాలు బాగానే ఉంటాయి. పట్టణ ప్రజలు మమ్మల్ని విశేషంగా ఆదరిస్తున్నారు.

– వి.ఏసు, హైదరాబాద్ అశోక్ నగర్‌లో నర్సరీ నిర్వాహకుడు.

క్లుప్తంగా

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి


రైలు నుంచి జారిపడి మృతిచెందిన అనిల్‌కుమార్

తుని: అన్నవరం, గొల్లప్రోలు మధ్యలో రైలు నుంచి జారిపడి కోరుబిల్లి అనిల్‌కుమార్ (34) మృతి చెందాడని తుని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. విశాఖపట్నం మర్రిపాలెంకు చెందిన కోరుబిల్లి అనిల్‌కుమార్, అతని భార్య, కుమార్తెతో కలిసి ఆదివారం రాత్రి విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి బయలుదేరారు. ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో వెళుతున్న అనిల్‌కుమార్ రాత్రి 9 గంటల సమయంలో భోజనం చేసి చేతులు కడుగుకునేందుకు వాష్ బేషిన్ దగ్గరకు వెళ్లిన సమయంలో రైలు కుదుపులకు జారి పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

కొవ్వూరు: తన తల్లిదండ్రుల నుంచి సంక్రమించిన ఇంటిలోకి వెళ్లకుండా తన పెద్ద సోదరుడైన పోలుమాటి రవి అడ్డుకుంటున్నారని జంగం రమాదేవి అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు పట్టణ ఏఎస్సై జీజీ ప్రకాష్ తెలిపారు. క్రిస్టియన్‌పేటకు చెందిన రమాదేవి తల్లిదండ్రులకు ఆమెతో పాటు ఇద్దరు సోదరులున్నారు. వీరికి రెండు పోర్షన్‌ల ఇల్లు ఉంది. అన్నదమ్ములకు చేరొక పోర్షన్ రాశారు. చిన్న సోదరుడు పెళ్లి చేసుకోలేదు. చిన్న తమ్ముడి పోర్షన్‌లోకి తాను వెళ్లకుండా పెద్ద సోదరుడు అడ్డుకుంటున్నారని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	15,500
గటగట (వెయ్యి)	14,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	14,500
గటగట (వెయ్యి)	13,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

విద్యుత్‌కూ వేసవి తాపం!

- లోడు ఎక్కువైతే వైర్లు కాలిపోయే అవకాశం
- షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలకు ముప్పు
- వైరింగ్‌లో ప్రమాణాలతో ప్రమాదాలకు చెక్
- సరఫరాలో లోపాలుంటే ఫిర్యాదు చేయాలి

సింగిల్ ఫేజ్ సర్క్యూట్‌లో ఫేజ్, న్యూట్రల్, ఎర్త్ వైర్లు సమాన పరిమాణంలో ఉండేలా చూసుకోవాలి.

ఏసీలు, ఫ్రిజ్‌లు, టీవీలు ఇతరత్రా విద్యుత్ ఉపకరణాలు వాడే సమయంలో కచ్చితంగా స్టెబిలైజర్లను వినియోగించాలి. విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గులు వస్తుంటే సత్వరమే సంబంధిత విద్యుత్ సిబ్బందికి ఫిర్యాదు చేయాలి, లేకుంటే సమీప ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయే ప్రమాదముంది.


షార్ట్ సర్క్యూట్‌తో ముప్పు ఇలా..


ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం కావడంతో వ్యాపిస్తున్న పొగలు

ఆలమూరు: వేసవి వచ్చేసింది. ఎండలు అంతకంతకూ ముదురుతున్నాయి. ఉష్ణోగ్రతలు 35–40 డిగ్రీల వరకూ నమోదవుతున్నాయి. ఉక్కపోత నుంచి ఉపశమనానికి విద్యుత్ ఉపకరణాల వినియోగం మూడింతలవుతోంది. ఇక్కడి వరకూ బాగానే ఉన్నా విద్యుత్ వైర్ల సామర్థ్యంపైనే సందేహాలన్నీ. కన్సీల్డ్ వైరింగా.. గోడలపైనే గొట్టాల్లో ఏర్పాటు చేశారా.. సరైన ప్రమాణాలతో తగిన మందం ఉన్న వైర్లు వేశారా అనేది అందరూ గుర్తించాల్సిన అంశం. ఏదైనా లోపాలుంటే విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం పొంచి ఉందన్న విషయాన్ని గుర్తెరగాలి. ఈ నెలాఖరు నాటికి ఉష్ణోగ్రతలు 40–45 డిగ్రీల వరకు చేరే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో జాగ్రత్తలతో పాటు అప్రమత్తత ఎంతో అవసరం ఉంది.

ఇలా చేయవద్దు

◆ గృహంలో 15 యాంప్స్ విద్యుత్ ఉపయోగించే చోట 30 యాంప్స్ విద్యుత్ భారం పడే పరికరాలు వినియోగిస్తే తీగలు కాలిపోయే ప్రమాదముంది.

◆ ఒకే స్విచ్ బోర్డుకు ఎక్కువ ప్లగ్‌లు ఉపయోగిస్తే ఒక్కసారిగా లోడ్ పెరిగి స్పార్క్ వచ్చి ప్రమాదాలకు అవకాశముంటుంది.

◆ ఎండలో విద్యుత్ తీగలు ఉంచితే భవిష్యత్‌తో తీగలపై ఉన్న రబ్బర్ మెత్తబడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది.

◆ ఇంటిలో ఒకేసారి విద్యుత్ ఉపకరణాలన్నీ ఆన్ చేసి ఉంచవద్దు.

◆ కంప్యూటర్ పరికరాలు, టీవీల వద్ద విద్యుత్ తీగలను చిందర వందరగా ఉంచవద్దు.

◆ రక్షణ పరికరాలైన ఎంసీబీ (మైక్రో సర్క్యూట్ బ్రేకర్), ఎంసీసీబీ (కరెంట్ కంట్రోలర్ బ్రేకర్) ఫ్యూజులను బైపాస్ చేయకూడదు.

తీసుకోవలసిన జాగ్రత్తలు

◆ వేసవికాలం ప్రారంభమయ్యే ముందు తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ ఇళ్లు, కార్యాలయాలను తప్పనిసరిగా ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లతో తీగల వ్యవస్థను తనిఖీ చేయించుకోవాలి.

◆ విద్యుత్ వైరింగ్ చేయించేటప్పుడు పూర్తిగా ఐఎస్ఐ, బీఐఎస్ మార్క్ కలిగిన ఎలక్ట్రికల్ సామగ్రిని మాత్రమే ఉపయోగించాలి.

◆ ఇంట్లో విద్యుత్ వినియోగం ఆధారంగా విద్యుత్‌శాఖ నుంచి లోడ్‌ను తీసుకోవాలి.

◆ అందుకు తగినట్లు వైరింగ్ ఏర్పాటు చేసుకున్న తరువాత ఏసీలు, కూలర్లు, వాటర్ హీటర్లు, మైక్రో ఓవెన్ ఇతర ఎలక్ట్రికల్ వస్తువులు వినియోగించుకోవాలి.

◆ ఎలక్ట్రానిక్ ఉపకరణాన్ని బట్టి దానికనుగుణంగా నాణ్యత కలిగిన విద్యుత్ తీగలను వినియోగించాలి.

◆ నాసిరకం విద్యుత్ పరికరాలతో విద్యుత్ వృథా కావడంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వైరింగ్ మరింత పటిష్టంగా ఉండేలా చూసుకోవాలి.

◆ గృహాలు, వాణిజ్య సంస్థలు, కార్యాలయాల్లో తప్పనిసరిగా న్యూట్రల్ పరికరాల కోసం సరిపడినంత ఎర్త్ ఎలక్ట్రోడ్ ఏర్పాటు చేసుకోవాలి.

◆ ఎండాకాలంలో రక్షణ పరికరాలు సరిగ్గా పని చేయాలంటే ఎర్తింగ్ సరైన పద్ధతిలో ఉంచేందుకు అవసరమైన ప్రదేశంలో నీరు, దొడ్డు ఉప్పు ఉపయోగించాలి.

◆ విద్యుత్ వాడేందుకు మూడు పిన్నుల ప్లగ్‌లు, సాకెట్లు మాత్రమే ఉపయోగించాలి.

◆ విద్యుత్ స్తంభాల నుంచి మీటర్ వరకు ఉండే సర్వీస్ వైర్లు అతుకులు లేకుండా ఉండేలా చూసుకోవాలి.

అప్రమత్తంగా ఉండాలి



వేసవికాలంలో విద్యుత్ తీగలు వ్యాకోచం చెందే అవకాశం ఉన్నందున షార్ట్ సర్క్యూట్ జరగకుండా తగిన జాగత్తలు తీసుకోవాలి. గృహాల్లో వినియోగించే విద్యుత్ ఉపకరణాలకు అనుగుణంగా ప్రత్యేకంగా వైరింగ్‌ను చేయించుకోవాలి. విద్యుత్ సరఫరాల్లో లోపాలు ఉంటే సత్వరమే సమీప లైన్‌మెన్‌కు తెలియజేసి సమస్యను పరిష్కరించుకోవాలి.

– కె.రత్నాలరావు, ఏపీఈపీడీసీఎల్ ఈఈ, రామచంద్రపురం.

అధిక లోడుతో అనర్థమే



వేసవి కాలంలో విరివిగా విద్యుత్ ఉపకరణాల వినియోగం వల్ల ఒక్కొక్కసారి సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతుంటాయి. గృహాల్లో కాని, కార్యాలయాల్లో కాని వాడుతున్న విద్యుత్ వాడకాన్ని బట్టి లోడ్‌ను నిర్ధారించుకుని ఆ మేరకు విద్యుత్‌శాఖ నుంచి అనుమతి తీసుకోవాలి. దీంతో విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి వినియోగదారునికి అవసరమైన లోడ్‌ను ఆ ట్రాన్స్‌ఫార్మర్‌లో అందుబాటులో ఉంచుతుంది. ఎవరైనా వినియోగదారుడు కేవలం 1 కేవీ లోడుకు మాత్రమే అనుమతి పొంది వేసవి తీవ్రత దృష్ట్యా అధికంగా విద్యుత్‌ను వినియోగిస్తే ఆ ప్రభావం సమీప ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంది. ఒక్కొక్కసారి షార్ట్ సర్క్యూట్ సంబంధించి కాలిపోయే అవకాశం కూడా ఉంటుంది. వినియోగదారులందరకూ విద్యుత్‌శాఖకు సహకరించి వాడుతున్న లోడ్‌కు అనుగుణంగా అనుమతి పొందితే భవిష్యత్‌లో విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశం తక్కువగా ఉంటుందని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణకు డిమాండ్

- భారీ ర్యాలీకి తరలివచ్చిన వేలాది మంది
- కదం తొక్కిన క్రైస్తవులు


కాకినాడ కలెక్టరేట్‌కు చేరుకున్న ర్యాలీ


ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతున్న బిషప్ జ్యోతికుమార్


ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవ నాయకులు, సభ్యులతో నిండిపోయిన ముత్తా బ్రిడ్జి ఏరియల్ వ్యూ

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి ప్రవీణ్ కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని కాకినాడ జిల్లా పాస్టర్స్ జేఏసీ ప్రతినిధి బిషప్ జ్యోతికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కాకినాడ భానుగుడి సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు పాస్టర ప్రవీణ్ మృతికి నిరసన తెలియజేస్తూ కాకినాడ క్రైస్తవ పాస్టర్ల జేఏసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఉద్దేశించి జ్యోతికుమార్ మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాలను హత్య చేశారనే నమ్ముతున్నామని, ఒక దైవ జనుడిని హత్య చేస్తే క్రైస్తవ్యం ఆగిపోతుందనుకుంటే అది పొరపాటే అన్నారు. తొలి దినాల్లో అపోస్తలులను చెరలో వేసి సువార్తను అపుదాం అనుకున్నారు, కాని చెరలో సువార్తికులను బంధించారు కానీ, సువార్త ఆగలేదని గుర్తు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన పాస్టర్ ప్రవీణ్ మృతి కేసును సీబీఐకి అప్పగించాలన్నారు. ఒక్క ప్రవీణ్ పగడాలను చంపితే వందలాది మంది ప్రవీణ్‌లు పుట్టుకొస్తారన్నారు. కూటమి ప్రభుత్వం క్రైస్తవుల రక్షణకు భరోసా ఇవ్వాలన్నారు. సీవైఎఫ్ డైరెక్టర్ మూర్తి రాజు మాట్లాడుతూ ప్రవీణ్ పగడాలను చంపినంత మాత్రాన సువార్త ఆగదని, సువార్త ప్రకటించమని యేసు ఇచ్చిన ఆజ్ఞను ప్రతీ క్రైస్తవుడు పాటిస్తాడన్నారు. ప్రభుత్వం ప్రవీణ్ పగడాల ఎలా చనిపోయారో చెప్పాలని, రోడ్డు ప్రమాదం అయితే ఎలా జరిగింది, దాడి చేస్తే ఎవరు దాడి చేశారు అనేది పోలీస్ వారు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఏబీసీసీ ప్రతినిధి రిక్కి గూటం మాట్లాడుతూ ప్రభుత్వం చొరవ తీసుకుని పాస్టర్ ప్రవీణ్ అనుమానాస్పద మృతి పై క్రైస్తవ సమాజానికి ఉన్న అనుమానాలు నివృత్తి చేయాలన్నారు. ఈ ర్యాలీకి తరలి వచ్చి వందలాది క్రైస్తవులు తమ ఐక్యతను చాటారని, ప్రవీణ్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడతామన్నారు. అనంతరం ర్యాలీ భానుగుడి సెంటర్ నుంచి ముత్తా బ్రిడ్జి మీదుగా రామారావు పేట, జెడ్పీ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు కొనసాగింది. క్రైస్తవ పాటలు పాడుతూ, నినాదాలు చేస్తూ ర్యాలీని కొనసాగించారు.

ఈ ర్యాలీలో వియ్ వాంట్ జస్టిస్, న్యాయం కావాలని, దోషులను శిక్షించాలంటూ క్రైస్తవ సంఘ నాయకులు, సభ్యులు నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో క్రైస్తవ దైవజనులు డి.సామ్యూల్ సాగర్, బిషప్ జోసెఫ్ బిన్ని, శీరం ఐజాక్; పి.ఐజాక్, వి.విజయ్ కుమార్; జాషువ గిరి, క్రైస్తవ సంఘాల నాయకులు, సభ్యులు వేలాదిగా పాల్గొన్నారు.

రెండు కుటుంబాల

ఘర్షణపై సీఐ విచారణ


ఎస్.పైడిపాలలో విచారణ చేస్తున్న ప్రత్తిపాడు సీఐ సూర్యఅప్పారావు

రౌతులపూడి: మండలంలోని ఎస్.పైడిపాలలో గత శనివారం రాత్రి జరిగిన రెండు కుటుంబాల ఘర్షణపై ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు సోమవారం విచారణ చేపట్టారు. ఘర్షణ పడిన బాధిత కుటుంబీకులను, ఘటనా స్థలం సమీపంలోని నివసిస్తున్న పలువురిని విచారించారు. ఇరువర్గాల వివాదానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఘటనపై నివేదికను పోలీసు ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. అనంతరం వారి ఆదేశాల మేరకు చర్యలు చేపడతామన్నారు. గ్రామంలో ఎలాంటి ఘర్షణలు, వివాదాలు తలెత్తకుండా పోలీసు పికెటింగ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట రౌతులపూడి రైటర్ డీవీ రమణ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

ర్యాపిడో వెహికల్‌ను ఢీకొట్టిన కారు


ఈర్లు నాగబాబు (ఫైల్)


ఒంటెద్దు వెంకటేష్ (ఫైల్)


నాగబాబు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: ర్యాపిడో వెహికల్‌పై వెళుతున్న ఇద్దరిని కారు అతివేగంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శనివారం అర్ధరాత్రి కొంతమూరు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం హుకుంపేట వరలక్ష్మీనగర్‌కు చెందిన ఈర్లు నాగబాబు(43) జీవనాధారం కోసం ర్యాపిడో వెహికల్ నిర్వహిస్తున్నాడు. కొంతమూరు కళ్యాణ్‌నగర్ చెందిన ఒంటెద్దు వెంకటేష్(28) డిగ్రీ చదివి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. వెంకటేష్ శనివారం సాయంత్రం స్నేహితులను కలిసేందుకు వచ్చాడు. సోమాలమ్మ జాతర చూసి పక్కనే ఉన్న అప్సర థియేటర్‌లో సెకండ్‌షో సినిమా చూశాడు. సినిమా అయిపోయిన తరువాత ఇంటికి వెళ్లేందుకు ర్యాపిడో బుక్ చేసుకున్నాడు. వెంటనే ఈర్లు నాగబాబు అప్సర థియేటర్ వద్దకు వచ్చి వెంకటేష్‌ను తీసుకుని కొంతమూరు కళ్యాణ్‌నగర్‌కు బయలుదేరాడు. కొంతమూరు మనీషా ఫంక్షన్ హాలు వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి కారు అతివేగంగా వచ్చి ర్యాపిడో వెహికల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒంటెద్దు వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందగా, కొన ఊపిరితో ఉన్న ఈర్లు నాగబాబును అంబులెన్స్‌లో తీసుకువెళుతుండగా మార్గమధ్యలో చనిపోయాడు. ఘటనా స్థలాన్ని రాజానగరం పోలీసులు పరిశీలించి, మృతదేహాలను పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. వెంకటేష్ తండ్రి ఒంటెద్దు వీరభద్రరావు ఫిర్యాదు మేరకు రాజానగరం ఎస్సై మనోహర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఈర్లు నాగబాబు, ఒంటెద్దు వెంకటేష్ కుటుంబ సభ్యులను డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ పరామర్శించారు. ఈర్లు నాగబాబు కుటుంబానికి చందన నాగేశ్వర్ రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు.

ఉపాధి కోసం ర్యాపిడో ఎంచుకుంటే...

ఆర్థికంగా కుటుంబానికి ఆసరాగా ఉంటుందని రాత్రి సమాయల్లో ర్యాపిడో వెహికల్‌ను నిర్వహిస్తున్న ఈర్లు నాగబాబును అదే మృత్యుఒడికి చేర్చింది. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు, భార్య, ఇద్దరు మగపిల్లలు ఇతనిపై ఆధారపడి ఉన్నారు. దీంతో కుటుంబానికి ఆసరాగా నిలవాలన్న ఉద్దేశంతో నాగబాబు ర్యాపిడో ద్వారా పగలు,రాత్రి అని తేడా లేకుండా పని చేస్తున్నాడు. రోడ్డు ప్రమాదంలో నాగబాబు మృతిచెందడంతో తల్లిదండ్రులు బేబి, ఆదినారాయణ, అనారోగ్యంతో బాధపడుతున్న భార్య శ్రీలత, ఇద్దరు పిల్లలు తమకు దిక్కెవరంటూ రోదిస్తున్న తీరు చూపరులను కలిచి వేసింది.

ఉగాది పండగకు వచ్చి...

బెంగళూరులో ఉద్యోగం చేస్తూ తెలుగు సంవత్సరాది అయిన ఉగాది పండగను కుటుంబ సభ్యులతో జరుపుకొని ఆనందంగా గడుపుదామని రెండు రోజుల క్రితం ఒంటెద్దు వెంకటేష్ ఇంటికి వచ్చాడు. అతను ఇలా మృతిచెందడం కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. వెంకటేష్ తండ్రి ఒంటెద్దు వీరభద్రరావు పండ్ల వ్యాపారం నిర్వహిస్తుంటారు. ఆయనకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తెకు వివాహం చేయగా, కుమారుడు వెంకటేష్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. పండగకు వచ్చి ఇలా మృత్యువాత పడతావని అనుకోలేదని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

కాపురానికి పంపమంటే..

కత్తితో కడతేర్చారు


రక్తపు మడుగులో శివ మృతదేహం


పేరం శివ (ఫైల్)

నల్లజర్ల: కన్న కూతుర్ని తరుచూ ఇబ్బందులకు గురిచేస్తున్న అల్లుణ్ణి మామ, బావమరిది కత్తితో నరికి చంపారు. ఈ ఘటన తూర్పుగోదావరి జిల్లా మండల కేంద్రం నల్లజర్ల ముత్తరాసుపేటలో సోమవారం రాత్రి జరిగింది. ఇన్‌చార్జి ఎస్ఐ సతీష్ అందించిన వివరాల ప్రకారం నల్లజర్లకు ముత్తరాసుపేటకు చెందిన రేగుల వెంకన్న భారతిల కుమార్తె భానుకు అదే గ్రామానికి చెందిన పేరం శివతో నాలుగేళ్ల కిందట ప్రేమ వివాహం జరిగింది. వారికి మూడేళ్ల కుమార్తె ఉండగా భాను ఇపుడు గర్భవతి. పెళ్లైన నాటి నుంచి తరుచూ భార్యాభర్తలు తగవులు పడుతున్నారు. అదే క్రమంలో మూడు రోజుల కిందట భార్యాభర్తలిద్దరూ గొడవ పడ్డారు. భాను పుట్టింటికి వెళ్లిపోయింది. సోమవారం ఉదయం శివ అత్తవారింటికి వెళ్లి భార్యను పంపమని అడిగాడు. అందుకు అత్తమామలు సమ్మతించలేదు. ఎలా పంపరో చూస్తానంటూ హెచ్చరించాడు. సోమవారం రాత్రి 8 గంటల సమయంలో శివ మామ వెంకన్న, అతని బావమరిది శ్రీరామ్ మరో ముగ్గురు బంధువులు శివ ఇంటికి వచ్చి అతని తల్లిదండ్రులతో గొడవ పడ్డారు. తర్వాత ఇంట్లో నుంచి వస్తున్న శివను కత్తితో మెడ మీద నరికారు. శివ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలు

- భర్త పరిస్థితి విషమం
- మోటారు బైక్‌ను ఢీ కొన్న కారు
- కారు డ్రైవ్ చేసిన మైనర్లు



గాయపడిన లక్ష్మణరావు గాయపడిన శిరిష

సామర్లకోట: మైనర్లు కారు డ్రైవింగ్ చేయడంతో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటారు సైకిల్‌పై వెళుతున్న భార్యాభర్తలు తీవ్రంగా గాయపడిన ఘటన ఇది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వేట్లపాలెం, గాంధీనగర్‌కు చెందిన గద్దె లక్ష్మణరావు, శిరిష మోటారు సైకిల్‌పై కాకినాడ ఆస్పత్రికి వెళుతున్నారు. సామర్లకోట నుంచి వేట్లపాలెం అతి వేగంగా వస్తున్న కారు కెనాల్ రోడ్డులో వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద మోటారు సైకిల్‌ను ఢీ కొనడంతో ఐదు అడుగుల ఎత్తు ఎగిరి కింద పడింది. డ్రైవింగ్ చేస్తున్న మైనర్ బాలుడు కారును అదుపు చేయలేక పోవడంతో కింద పడిన వారిని 20 మీటర్ల దూరం వరకు ఈడ్చుకుపోయి రోడ్డు మార్జిన్‌లో కారు ఆగింది. కారు వేగం తగ్గించే క్రమంలో బ్రేక్ తొక్కబోయి, ఎక్స్‌లేటర్ తొక్కడం వల్ల కారు వేగం పెరిగినట్టు కారులో ఉన్న మైనర్లు చెప్పారని స్థానికులు తెలిపారు. ఇంటి నుంచి బయలు దేరిన 10 నిమిషాలకు ప్రమాదం జరిగినట్టు తెలియడంతో గ్రామ ప్రజలు ఘటనా ప్రదేశానికి చేరుకొని ప్రత్యేక అంబులెన్సులో క్షతగాత్రులను కాకినాడ ట్రస్టు ఆస్పత్రికి తరలించారు. కారులో ఐదుగురు మైనర్లు ఉండగా ఒక మైనర్ బాలుడు పారిపోవడంతో మిగిలిన నలుగురిని గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించిన్నట్లు స్థానికులు తెలిపారు. బలభద్రపురానికి చెందిన ట్రావెల్ ఏజెన్సీ నుంచి రమేష్ అనే వ్యక్తి కారును అద్దెకు తీసుకొనగా అతని నుంచి బిక్కవోలుకు చెందిన మైనర్ యువకులు కారు తీసుకున్నట్లు తెలిసింది. క్షతగాత్రుడు గద్దె లక్ష్మణరావు వేట్లపాలెం సమీపంలో ఉన్న హుస్సేపురం వెంకట్రామ ఆయిల్ ఫ్యాక్టరీలో పనిచేస్తాడని వేట్లపాలెం గ్రామస్తులు తెలిపారు. ఘటనలో కారు నుజ్జు నుజ్జు కాగా మోటారు సైకిలు ధ్వంసం అయింది. సీఐ ఎ.కృష్ణభగవాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టపగలు అమ్మవారి మంగళ సూత్రాల చోరీ

రాయవరం: భక్తుడిలా ప్రవేశించిన అగంతకుడు అమ్మవారి మెడలో బంగారు మంగళ సూత్రాలను చోరీ చేసిన ఘటన కలకలం సృష్టించింది. స్థానిక తుల్యభాగ నదీతీరాన ఉన్న అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పట్టపగలు చోటు చేసుకున్న చోరీ ఘటన స్థానికంగా సంచలనం కలిగించింది. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో గుర్తు తెలియని అగంతకుడు భక్తుడిలా గర్భగుడిలో ప్రవేశించాడు. అదే సమయంలో ఆలయ అర్చకుడు సామాన్లు సర్దుకుంటున్నారు. భక్తుడు స్వామివారిని, అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చాడన్న ఆలోచనతో అర్చకులు సూర్యనారాయణశర్మ ఏమరుపాటుగా ఉన్నారు. కాగా ఆలయాన్ని మూసివేసే సమయంలో అమ్మవారి మెడలో మంగళసూత్రాలు అదృశ్యమైనట్లుగా గుర్తించిన అర్చకుడు ఆ విషయాన్ని ఆలయ కమిటీ దృష్టికి తీసుకుని వెళ్లారు. 4 గ్రాముల బంగారు మంగళ సూత్రాల విలువ రూ.30వేలు ఉంటాయని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. చోరీ ఘటనపై అర్చకులు సూర్యనారాయణశర్మ రాయవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.సురేష్‌బాబు తెలిపారు. ఇదిలా ఉంటే అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయానికి సమీపంలో ఉన్న పోలమ్మ తల్లి ఆలయానికి ఏర్పాటు చేసిన సీసీ పుటేజీలను పరిశీలించగా జీన్ ఫ్యాంట్, టీ షర్ట్, టోపీ ధరించిన వ్యక్తి ఆలయం నుంచి బయటకు వెళ్లిన దృశ్యం రికార్డు అయినట్లుగా గుర్తించారు. ఆలయం సమీపంలో ఉన్న రైసుమిల్లులు, వ్యాపార సముదాయాల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పుటేజీలను కూడా పరిశీలిస్తున్నట్లు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు.